

కథా కౌముది

# అత్యవసర మార్గము

## పాలగుమ్మి రామకృష్ణారావు

సాయింత్రం నాలుగు గంటలయింది. ఎండ తీవ్రంగానే వుంది. ప్రయాణం చెయ్యవలసిన దూరం నలభై మైళ్ళు.

డౌన్ టౌన్ మెక్కనే లో జరగబోయే అమెరికా స్వాతంత్రయ వేడుకలు చూడడానికి నిస్సాన్ ఆర్య ఎలక్ట్రిక్ కారులో రోడ్డు మేప్ ననుసరించి మేం కుటుంబంతో కలసి వెళుతున్నాం.

“హెన్రి మనం చాలా తొందరగా బయల్దేరాం కదూ. ఈ ఎండను పిల్లలు తట్టుకోలేరు.” అన్నాను విండో గ్లాస్ నుండి మీద పడుతోన్న ఎండకు పేపరు అడ్డుపెట్టుకొని.

హెన్రి దృష్టిని రోడ్డుపైనుండి మరల్చకుండా జవాబిచ్చాడు. “ఫరవాలేదు, అక్కడ నీడనిచ్చే చెట్లు చాలానే వున్నాయి. టెంట్ డిక్కీలో వేసాను. ఎన్నో సంవత్సరాలనుండి మనం ఇలాగె వస్తున్నాం. మరో గంట ఆలస్యం చేస్తే కారు పార్కింగ్ దొరకదు. అన్నా! మధ్యలో రెస్టారెంట్ దగ్గర ఆగడం మర్చిపోయాం. పిల్లలకు స్నాక్స్ ఏం తీసుకోలేదు.”

“అక్కడ దొరికే ఫుడ్ ఎంజాయ్ చేస్తారు వాళ్ళు.”

“అది సరే అన్నా, నీ మాటేవిటి? ”

“ నాకు ఏదైనా ఒక్కటే. డ్రైవ్ ప్లీజ్.”

"ఓ.కె. చిల్డ్రన్ మాయ, అమర. మీకు ఓ.కె.నా?"

"ఎస్ డాడ్. అక్కడే ఎంజాయ్ చేద్దాం" అన్నారు వాళ్లిద్దరూ.

"అన్నా... అన్నా...." రెండు సార్లు పిలిచినా నేను జవాబివ్వలేదు. హెన్రి నన్ను అలా పిలుస్తోంటే నాకు చాలా సంతోషంగా ఉంటుంది.

ఎందుకంటే నా అసలు పేరు 'అన్నపూర్ణ' అమెరికాలో సెటిల్ అవ్వాలని నిర్ణయించుకున్నకా, పెళ్ళి తరువాత హేన్రి కోరిక మేరకు 'అన్నా' అని మార్చుకున్నాను. మా పిల్లల పేర్లు కూడా మా ఇద్దరకు ఇష్టమైన రెండు దేశాలకు దగ్గరైన పేర్లు పెట్టుకున్నాం.

రోజులు ఇక్కడి కార్లలాగే అతివేగంగా దొర్లుతున్నాయి. నేను అమెరికా, టెక్సాస్ రాష్ట్రంలో గార్లండ్ నగరానికి వచ్చి పన్నెండు సంవత్సరాలైపోయిందంటే నాకే నమ్మకం కలగటం లేదు. కానీ ఎదిగిన మా పిల్లలను చూసాకనైనా నమ్మక తప్పదు.

పెద్దమ్మాయి మాయ పది సంవత్సరాలు. చిన్నది అమర ఏడు సంవత్సరాల వయస్సుది. ఇద్దరు గవర్నమెంటు స్కూళ్లల్లో చదువుకుంటున్నారు. ఇంక కారులో వెనుక పిల్లలతోబాటు మధ్యలో కూర్చున్నది మా అత్త కరెన్. నేను ఆవిడను 'అత్తా' అనే పిలుస్తాను. నేను తెలుగు దాన్ని. ఎక్కడున్నా తెలుగుదనాన్ని వెతుక్కుంటాను. కరెన్ నా పిలుపుకు అభ్యంతరం పెట్టలేదు.

విశాలమైన రోడ్లు, రోడ్లు పక్క పచ్చిక మైదానాలు, తలుపులు మూసుకొని, బోర్డులు మాత్రమే కనపడే హోటళ్లు, ఆఫీసులు ఇవన్నీ నా కంటికి బాగా అలవాటైన దృశ్యాలు. ఇప్పుడు నేను కారు కిటికీలోంచి బయటకు చూస్తోన్నా ఈ దృశ్యాలు ఏవీ నాకు కనపడవు. ఇండియాలో నేను నివసించిన ఇల్లు, చదివిన స్కూళ్లు, తిరిగిన ప్రదేశాలు అవి కంటి ముందు నిలుస్తాయి. ఆ దృశ్యాలకు ఇన్ని సంవత్సరాలు దూరంగా వున్నా వాటిని చెరపలేకపోతున్నాను.

"అన్నా.. నువ్వేం మాటలాడటం లేదు. నీకు పేరెంట్స్ గుర్తుకువస్తున్నారు కదూ?" హెన్రికి బాగా తెలుసు. నేను ఎప్పుడు నిశ్శబ్దంగా ఇలా చూస్తో వున్నా నన్ను ఇదే ప్రశ్న వేస్తాడు. హేన్రి ఇలా అడిగినప్పుడు అతని చిరునవ్వుమధ్యనుండి ప్రశ్న బయిటికి వస్తుంది.

అవును గుర్తుకువస్తున్నారు. నేను ఈ మాట గొంతు విప్పి చెప్పనక్కరలేదు. హెన్రికి, అత్తకు, పిల్లలకు తెలిసిన జవాబే ఇది. కళ్ళలో నీటిపొర. వణుకుతోన్న పెదవులను దాటని మాట దానికి జవాబు.

పన్నెండు సంవత్సరాల క్రితం టెక్సాస్ యూనివర్సిటీలో ఎం.యస్. సీటు సంపాదించుకుని అమెరికా ప్రయాణమైనప్పుడు అమ్మానాన్నలు పట్టలేని సంతోషంతో ఆశీర్వదించి పంపారు. చదువుకు బ్యాంకులోను దొరికింది. కొంత నాన్న సహాయం కలిసింది. అన్నిటికన్నా ఇక్కడ హేన్రి స్నేహ హస్తం ముందుకు నడిపింది.

చదువు అయిన వెంటనే ఉద్యోగ అవకాశం కూడా వచ్చింది. ఇక్కడే వుండి బ్యాంకు అప్పు తీర్చుకున్నాను. హేన్రి ప్రేమను కాదనలేకపోయాను. ఈ పెళ్లితో నాకు స్థిర నివాసం ఇచ్చి ఆశీర్వదించింది అమెరికా.

నాన్నకు పెళ్ళికి ముందుగానే ఫోన్ చేసి చెప్పాను. ఆ కాల్ పూర్తికాకుండానే మధ్యలో ఆగిపోయింది. తరువాత నా నెంబరు బ్లాక్ అయింది.

నాకు తెలుసు వాళ్లకు కోపం వస్తుందని. హెన్రిని తీసుకుని హైద్రాబాదు వచ్చాను. ఇల్లు అక్కడ అలాగే వుంది. చుట్టూ నాకు తెలుసున్న కుటుంబాలు అక్కడే వున్నాయి. అమ్మానాన్నలు లేరు. ఇల్లు అమ్మేసుకుని ఎక్కడికో వెళ్లిపోయారు. ఎక్కడని వెతకగలను? చుట్టూ జనాల చూపులని తట్టుకోలేకపోయాను. నా పెళ్లి, బంధువులను కూడా దూరం చేసింది.

నా వివాహ నిర్ణయం తలిదండ్రులను ఇంత దూరం చేస్తుందని నేను ఊహించలేదు. నా చదువుకు స్వాతంత్రం ఇచ్చిన కన్నవాళ్ళు, నా ప్రేమను ఎందుకు అంగీకరించలేకపోయారో, వాళ్లతో నాకున్న ప్రేమను ఎందుకు దూరం చేశారో అర్థంకాని ప్రశ్న అయింది.

నన్ను సముదాయించేది హెన్రి ఒక్కడే. అతని ప్రేమ బంధం మరోసారి ఇండియా వెళ్లే అవకాశం ఇవ్వలేదు.

మనసున మనసై, బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యము... నిజమేనెమో! ఇదికూడా నమ్మకమైన మార్గమేనా? అత్తను చూసినప్పుడల్లా ఈ ప్రశ్న నా ముందుంటుంది. మామ బ్రతికే

వున్నాడు. అయినా అత్త ఒంటరిది. అమెరికాలో ప్రేమానుబంధాలకు దూరం అయినవాళ్లు అనేకమంది. పసిగుడ్డులనుండి ముసలివాళ్ళవరకు చూసాను. అత్త వాళ్లలో ఒకత్తె.

'మామ ఎందుకు దూరమయ్యాడు?' అంటే అత్త కూడా కన్నీళ్లే జవాబుగా చూబెడుతుంది.

ఇప్పుడు " డోంట్ వర్రీ బేబీ. ఉయ్ అర్ హియర్." అంది అత్త వెనుకనుండి నా భుజం మీద చెయ్యి వేసి.

కారు డౌన్ టౌన్ చేరింది. పార్కింగ్ కోసం రెండు రౌండ్లు కొట్టి చివరకు స్వతంత్ర వేడుక ఈవెంటుకు దగ్గరగా కారును పార్కు చేశాడు హెన్రి. తను కారు దిగి నా వైపుకు వచ్చి డోర్ తీసి చేయి అందించాడు. ముందుగా నా హ్యాండ్ స్టిక్ బయటపెట్టాను. హెన్రి చేయి పట్టుకుని బయటకు వచ్చాను. రెండు నెలలనుండి హ్యాండ్ స్టిక్ సపోర్టు తప్పనిసరి అయింది. చిన్న ఆక్సిడెంట్. ఎడం కాలు నడవనీయడం లేదు. ఉద్యోగం మాన్పించి ఇంట్లో కూర్చుండబెట్టింది. హ్యాండ్ స్టిక్కును సరిగ్గా పెట్టుకున్నాక హేన్రి చెయ్యి వదిలాను.

వెనక డోరులోంచి పిల్లలు అత్తను కూడా దింపారు. అది విశాలమైన మైదానం. అప్పటికే జనం చాలా మంది చేరారు. హెన్రి కాస్త కాళీ స్థలం చూసి టెంటు వేసి, ఫోల్డింగు చైర్లు, టేబులు దానికింద చేర్చాడు. అందరం కుర్చీల్లో నీడపట్టున కూర్చున్నాం. ఎండ ఇంకా పూర్తిగా దగ్గలేదు. నెట్ లో ప్రొగ్రామ్ మరోసారి చూసాను. ఆరు గంటలకు మిలటరీ విమానాల విన్యాసం. ఎనిమిది గంటలకు కలర్ క్రాకర్స్ షో ఉంటుంది. ఇక్కడ ఎనిమిది దాటితే కానీ చీకటి పడదు. వాళ్ళు కాల సూచనలు వ్రాసినా చీకటి పడటంపైనే ఈవెంట్ ఆధారపడివుంటుంది.

అక్కడున్న జనం అంతా జనాన్నే చూస్తున్నారు మాలాగే. అమెరికాలో ఇదొక విచిత్రం. కాలనీలలో ఏ ఇల్లు చూసినా తలుపులు మూసే ఉంటాయి. బయటకు ఎవరు కనపడరు. అవన్నీ ఏ.సి. ఇళ్ళు. మనుషులు ఇళ్లల్లో వుంటారు, లేకుంటే కార్లలో వుంటారు, మధ్యే మార్గంగా హోటళ్లు, మాల్స్, ఆఫీసుల్లో వుంటారు. ఇంతమంది జనం ఒకరిపక్కన ఒకరు కూర్చోవడం చాలా అరుదైన సంఘటన.

పిల్లల ఆట వస్తువులు అమ్ముకునేవాళ్లు మా మధ్య తిరుగుతున్నారు. ఒకటి రెండు ఐస్ క్రీమ్ తోపుడుబళ్లు కూడా వున్నాయి. నాకైతే ఇండియాలో శివరాత్రి తిరునాళ్ళు గుర్తుకువస్తుంది. పిల్లల ద్రుష్టి వాటిపైనే వుంది. హెన్రి పిల్లలిద్దరు అడిగిన బొమ్మలు కొనిచ్చాడు.

మైదానానికి మధ్యలో సిమెంటు రోడ్డుపై వున్న ఐస్ క్రీమ్ బండిని చూపించింది అమర. పిల్లలను చుసిన బండి వాడు చేతిలో గంటను వాయిస్తో రమ్మని పిలుస్తున్నాడు. అతని దృష్టి మా వైపే వుంది. అరవై ఏళ్ళు దాటిన వాడే. అమెరికన్ కదా! మనిషి బలంగానే వున్నాడు. గడ్డానికి, తలకు బ్రౌన్ కలరు వేసాడు. హెన్రి పిల్లలిద్దరినీ తీసుకువెళ్లి ఐస్ క్రిములు కొని మాకు కూడా రెండు పట్టుకువచ్చాడు.

మేం కూర్చున్న కొద్ధి దూరంలోనే మొబైల్ పుడ్ స్టాళ్ళు వున్నాయి.
హెన్రి నన్ను, అత్తను వదలి పిల్లలతో వాటి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ కూడా పెద్ద క్యూ ఉంటుంది. ఒకసారి తినుబండారాలు తెచ్చుకోవడం పూర్తి అయితే వాటిని తింటూ వున్న చోటునుండి ఈవెంటును చూస్తో ఎంజాయ్ చేయవచ్చు.

ఐస్ క్రీమ్ నాకు అంతగా నచ్చలేదు. “అత్తా బాగుందా?” అన్నాను.

“ఊఁ నాట్ బేడ్. పార్లర్లోలా అంతగా లేదు.” అంది కరెన్. అంతగా నచ్చకపోయినా తింటూనే వున్నాం. పారేయలేదు. ఆ బండి అతను ఇంకా ఇటే చూస్తో మెల్లగా గంట వాయిస్తున్నాడు. హెన్రి డబ్బులివ్వలేదేమో. వాడికి క్రెడిట్ కార్డు నడవదు. డబ్బే ఇవ్వాలి. అనుమానంతో లేచి బండి వరకు వెళ్ళాను.

“మీకు డబ్బులివ్వలేదా?”

“ఇచ్చారు. మేడమ్ ఆవిడ మీకేమౌతుంది?” అతను స్పానిష్, ఇంగ్లీషు కలపి మాట్లాడుతున్నాడు. నాకు నా భాషలో అర్ధమౌతుంది.

“ఎవరు?” అని వెనుకకు తిరిగాను. అతను అత్తను చూపెడుతున్నాడు.

“మా అత్త. ఐ మీన్ మై హస్బండ్స్ మామ్. నీకు పరిచయమా?””

“యస్!”

“ఎలా?”

అతను తన ఉద్వేగాన్ని ఆపుకోలేకపోతున్నాడు. కళ్ళు తుడుచుకున్నాడు. "నా భార్య!"

ఒక్క సారి నేను షాక్ అయ్యాను. అత్తకు ద్రుష్టి లోపం వుంది. అందుకే అత్తలో ప్రతిస్పందన లేదు. ఇతన్ని జనంలో ఒకడిగానే చూస్తోంది.

"మీరనేది నిజమేనా?" నా మాటలో మర్యాద చేరింది. "ఎందుకు దూరమయ్యారు?"

"నా వయసు దూరం చేసింది. నన్ను ప్రేమించే మరొక అమ్మాయి దొరికింది. చట్ట ప్రకారం విడాకులు తీసుకున్నాను."

"భార్యను వదిలెయ్యడం మీకు తప్పుగా అనిపించలేదా?"

"అప్పుడు అనిపించలేదు. నాకన్నా మంచి వ్యక్తి దొరికితే నా భార్య కూడా అదే పని చేసేది. నేను మోసం చెయ్యలేదు. ఆమెకు నచ్చచెప్పే విడాకులు తీసుకున్నాను."

ఇప్పుడు అతడిని గౌరవించాలా? ఈసడించుకోవాలా? నాకర్థం కావడం లేదు.

"ఇప్పుడొప్పుకుంటాను. నా రెండో భార్య నన్ను వదిలేసాకా తెలిసింది నేను తప్పు చేశానని. సరే. ఇప్పుడేం చెయ్యగలను!"

అదే నాకూ అర్థం కావడం లేదు.

"అబ్బాయి వాళ్ళ అమ్మని బాగా చూసుకుంటాడా?"

"ఊఁ"

"మీరు ఎక్కడుంటున్నారు?"

నేను సమాధానం చెప్పలేదు. భార్యాభర్తల సంబంధంపై నాకున్న ఆదర్శ భావనను ఒక్క క్షణంలో చెదరగొట్టాడు. నేను తప్పును సరిచెయ్యగలనా? ఒక ప్రయత్నం చెయ్యాలనిపిస్తోంది.

అతను ముందుకు కదిలాడు.

"ఒక్క క్షణం. మీ పేరు?"

"థామస్"

"ఇక్కడే వుంటారా?"

"ఈ చుట్టుపట్లే వుంటాను. హోంలెస్."

"ఇంత చిన్న వ్యాపారంతో?.."

"ఈ వయస్సులో ఇంతకన్నా చెయ్యలేను." అతను ముందుకు వెళ్ళిపోయాడు. అతని చేతిలో గంట మోగుతోంది. ఆ శబ్దం నా గుండెలకు తగులుతోంది.

హెన్రి పిల్లల్తో తిరిగి వచ్చాడు. వాళ్లకిష్టమైన పిజ్జాలు, బర్గర్లు తెచ్చుకున్నారు.

ఈవెంట్ ప్రారంభమైంది. మిలిటరీ విమానాలు గాల్లో చెక్కర్లు కొడుతున్నాయి. కొంతమంది విన్యాసకులు బెలూన్ల సహాయంతో వాటినుండి కిందకు దిగుతున్నారు. నాలో వున్న ఆందోళనకు ఈ విన్యాసాలు తోడై మరింత గందరగోళాన్ని కలిగిస్తున్నాయి.

ఈ నిజం హెన్రికి చెప్పాలా వద్దా? ముందుగా అత్తకు చెబితే? నేనే ఇంతగా ఆందోళన చెందుతో ఉంటే, ఈ విషయం తల్లికొడుకులకు తెలిస్తే వాళ్ళ భావోద్రేకాలు ఎలా వుంటాయో! గాల్లో పల్టీలు కొడుతోన్న ఆ విమానంలాగే వుంది నా మనసు .

"చెప్పకూడదు. ఇప్పుడు చెప్పను." మనసులో గట్టిగా నిశ్చయించుకున్నాను.

విమానాల విన్యాసం ఆగింది. చీకటి పడింది. మరి కొన్ని నిముషాలకు బాణాసంచా రంగురంగుల కాంతులతో ప్రజ్వరిల్లింది. అందరు ఉత్సాహంగా చప్పట్లు చరుస్తున్నాడు.

మెరుపులు ఆనందం.

శబ్దాలు ఆందోళన.

రెండు ప్రతి చర్యల మధ్య నా మనసు.

చేతిలో వున్న తినుబండారాలు అలాగే ఉండిపోయాయి.

నూతన సంవత్సర వేడుకల ఈవెంట్ ముగిసింది. జన సముద్రంతో కలసి మేం కూడా ఇంటి దారి పట్టాం.

★★★★

జవాబు దొరకని ప్రశ్నలా జరిగిన సంఘటనను రెండు రోజులు నాలోనే దాచుకున్నాను.

మా ఇంటికి, కారుకు పది నిముషాల దూరంలో వున్న కర్టిస్ కల్వెల్ సెంటర్ లో ఎస్లాబన్ ఆర్మడో మ్యూజికల్ పార్టీకి టికెట్లు బుక్ చేసాడు హెన్రి. స్పానిష్ మ్యూజిక్ పార్టీ అంటే అత్తకు చాలా ఇష్టం. తల్లి ఇష్టాన్ని దృష్టిలో పెట్టుకునే ప్రత్యేకంగా బుక్ చేసాడు.

నాకు హెన్రి చేసిన పని చాలా నచ్చింది. తల్లిమీద ఇంత ప్రేమను కలిగి వున్నవాడు తండ్రిని చేరువ చేస్తాడేమో! నాలో చిన్న ఆశ చిగురించింది. సాయంత్రం అందరం కల్వెల్ సెంటర్ కు బయలుదేరాం.

శ్రావ్యమైన సంగీతం మధ్యలో తీపి కబురు చెప్పాలి. హెన్రి తల్లిదండ్రులను ఒకటి చేసే మార్గానికి దారి వెయ్యాలి. నేను చెయ్యబోయే అద్భుతానికి నా మనసు పొంగిపోతోంది.

నా ఉత్సాహానికి హెన్రి ఆశ్చర్యపోతున్నాడు.

"అన్నా! ఏవిటి నువ్వు ఇలా? నీకు స్పానిష్ సంగీతం ఇష్టం లేదుగా?"

"థియేటర్లో చెపుతాను." అన్నాను నా నవ్వును దాచుకుంటూ.

ఎంతసేపు? కొద్ది సమయంలోనే థియేటరుకు రావడం మా సీట్లలో కూర్చోవడం జరిగిపోయింది. అత్తకు, హెన్రికి మధ్య సీట్లలో పిల్లలను కూర్చోబెట్టాను. నేను హెన్రి పక్కన కూర్చున్నాను.

సంగీత విభావరి మొదలైంది. మధ్యలో చిన్న బ్రేక్.

"హెన్రి!"

"చెప్పు."

"నేను మీ ఫాదర్ ను చూసాను? అయన పేరు థామస్ కదూ?"

"అవును. ఎప్పుడు? ఎక్కడ చూసావు?"

మొన్న డౌన్ టౌన్ లో ఈవెంటుకు వెళ్లాం కదా? అక్కడే. నువ్వుకూడా చూసావు."

"నేనా?"

"అందరికి ఐస్ క్రీమ్ కొన్నావుకదా! ఆయనే!"

" నాకు అప్పుడే ఎందుకు చెప్పలేదు?"

"ఏమో! నీ రియాక్షన్ ఎలా ఉంటుందో నాకు తెలియదు. అందుకే చెప్పలేకపోయాను. అయన అత్తను గుర్తు పట్టారు. హెన్రి మీ అమ్మానాన్నలు కలసి ఉండటం నీకిష్టమేనా?"

"అమ్మ బాధ్యత నాన్న తీసుకుంటానంటే నాకూ సంతోషమే. నాకో బరువు తగ్గుతుంది. డౌన్ టౌన్ వెళ్లి మాట్లాడదాం."

సమస్య మరో కోణంలోకి వెళ్ళిపోతోంది. హెన్రి తల్లి బాధ్యతను బరువుగా భవిస్తున్నాడా! ఆర్థిక సమస్యలు కూడా ప్రేమను దూరం చేస్తాయి అని నాకిప్పుడు తెలుస్తోంది.

మనుషల మధ్య ప్రేమ కప్పగంతులు వేస్తోంది.

హెన్రితో నా ప్రేమ నాకు తల్లిదండ్రుల ప్రేమను దూరం చేసింది.

అత్తమామలు ప్రేమతో కలసి వుండాలని కోరుకుంటే వాళ్లకు హెన్రిని దూరం చేస్తోంది.

ప్రేమ మనసులను ఒకటిగా బంధించేది కాదా? ప్రేమకు స్వార్ధం వుంటుందా? ప్రేమ స్వార్ధపు ముసుగులో దాగి వుందా?

ప్రోగ్రాం అయిపోయింది. జనం హాలు బయటకు వస్తున్నారు. పై అంతస్తునుండి కొన్ని మెట్లు దిగి బయటకు రావాలి. ఈ హాలుకు వెనుక వైపున ఎమర్జన్సీ ఎక్సిట్ దారి వుంది.

"హెన్రి నువ్వు అత్తను తీసుకుని ముందుకు వెళ్లి కారును ధియేటర్ వెనక్కు తీసుకురా. నేను పిల్లలను తీసుకుని అత్యవసర మార్గం ద్వారా బయటకు వస్తాను."

"అటెందుకు?"

"అటు ఖాళీగా ఉంటుంది. పిల్లలకు తెలియాలి మరో దారి కూడా ఉందని."

హెన్రి తిరిగి ప్రశ్నించే సమయం ఇవ్వకుండా పిల్లలను తీసుకుని వెనుకకు నడిచాను.

"ఇటు లైట్లు ఎక్కువగా లేవమ్మా" అంది మాయ.

మాయను భుజాన వేసుకున్నాను. అమర నా చేయి పట్టుకుంది. మెట్లు దిగుతొంటే తిరిగి వెలుతురు మామూలుగానే వచ్చింది.

హెన్రి కారు తెచ్చాడు. అందరం కూర్చున్నాం. కారు వేగంగా రహదారి పట్టుకుంది.

"హెన్రి! మరొక మాట. నేను రేపటినుండి డ్యూటీకి వెళతాను. ఇప్పుడు కాలు నడవనిస్తోంది."

హైవే మీద అనేకమైన కార్ల శబ్దాల్లో ఈ కారు శబ్దం కూడా కలిసిపోయింది.